క్లుప్తంగా

లీలావతికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రామీణాభివృద్ధి విభాగం పరిశోధకురాలు పి.లీలావతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గ్రామీణాభివృద్ధి విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య కె. సోమశేఖర్ పర్యవేక్షణలో 'ఆంధ్రప్రదేశ్‌లో కలంకారి కళ కృష్ణా జిల్లాపై ప్రధాన పరిశీలన' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించారు. లీలావతి విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.

ముగిసిన ఘంటసాల జయంతి వారోత్సవాలు



నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డులోని గుంటూరు అన్నదాన సమాజం ఆడిటోరియంలో మంగళవారం ఘంటసాల జయంతి వారోత్సవాలు ముగిశాయి. ముప్పై మంది గాయని, గాయకులతో ఘంటసాల స్వరాలాపన చేపట్టారు. ముఖ్యఅతిథిగా రంగస్థలం టీవీ సినీ నటుడు తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, సురేష్, దండిపట్ల శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ గాయకులు మాడభూషి ఘనశ్యామాచారి, చంద్రపాల్, గొట్టిపాటి రామారావు, మిరియాల ప్రసాద్‌రావు, గుడివాడ శ్రీనివాసరావులను అన్నదానం సంస్థ ఈఓ శ్రీనివాసరావు సన్మానించి జ్ఞాపికలను అందించారు.

నాగార్జున సాగర్ అపూర్వ కట్టడం



లక్ష్మీపురం: నాగార్జున సాగర్ ప్రాజెక్టు భారత దేశం గర్వంగా తలెత్తుకునేలా చరిత్ర పుటల్లో నిలుస్తోందని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి అయి 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ విదేశీ ఇంజినీర్ల సాంకేతిక పరిజ్ఞానంతో నిమిత్తం లేకుండా భారతీయ ఇంజినీర్లు తమ ప్రతిభా పాటవాలతో మొట్టమొదటిసారిగా నాగార్జున సాగర్ ఆనకట్టను అద్భుతంగా కట్టి ఇక్కడి మట్టి గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ,సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

మానవ హక్కులనేవి సమానత్వం న్యాయానికి సంబంధించినవని, అవి ప్రతి రోజు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తాయనటంలో సందేహం లేదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మానవ హక్కుల ఉద్యమ నేత ముప్పాళ్ల ప్రసాదరావు అన్నారు.అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య, సింగరయ్య, సదాశివం, మల్లేశ్వరరావు ప్రసంగించారు.

మహిళపై దాడి

లక్ష్మీపురం: డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉన్న మహిళపై తల్లి, కొడుకులు దాడిచేసిన ఘటనపై మంగళవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శివరామ్‌నగర్‌కు చెందిన నిర్మల మధ్యవర్తిగా ఉండి సురేష్‌కు రూ.లక్ష వడ్డీకి ఇప్పించింది. ఆ డబ్బులు తిరిగి ఇవాల్సిందిగా నిర్మల కోరింది. సురేష్, ఆయన తల్లి వీరమ్మలు కలిసి నిర్మలపై దాడిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ విద్యార్థుల విజ్ఞానయాత్ర



గుంటూరు ఎడ్యుకేషన్: పేరేచర్లలోని జోసిల్ పరిశ్రమను హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. కళాశాల ఫార్మాస్యూటికల్ ఎనాలసిస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞానయాత్రలో ఎం.ఫార్మసీ, డీ. ఫార్మసీ ద్వితీయ సంవత్సర, ఫార్మా.డి తృతీయ సంవత్సరం చదువుతున్న 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఈసందర్భంగా జోసిల్ పరిశ్రమలో గోద్రెజ్, లిరిల్, లక్స్ వంటి సబ్బులు ఇతర రసాయన పదార్థాలను తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, అధ్యాపకులు డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ పి.నాగరాజు, వి.సుధారాణి ఉన్నారు.

అప్కాస్ ఉద్యోగులకు పస్తులే..

- జీతాల కోసం ఎదురుచూపులు
- నేటి వరకు చెల్లించని నగరపాలక సంస్థ
- సీఎఫ్ఎంఎస్‌లో ఫండ్ నాట్ క్లియరెన్స్ అని చూపుతున్న వైనం
- అవస్థలు పడుతున్న చిరుద్యోగులు



నెహ్రూనగర్: అప్కాస్ ఉద్యోగులు పస్తులుండాల్సిన పరిస్థితి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఒకటో తేదీన జీవితాలు చెల్లిస్తామని గద్దెనెక్కిన పాలకులు పట్టించుకోవడం లేదు. ఓ పక్క పెరిగిన నిత్యావసరాల ధరలు, పిల్లల ఫీజులు చెల్లించాల్సిన కాలంతో పాటు శీతాకాలంలో వచ్చే వ్యాధుల ఖర్చు భరించలేని స్థితిలో నానా ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పూటగడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

గత ప్రభుత్వంలో ఠంఛన్‌గా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్కాస్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు ఠంఛన్‌గా జీతాలు పడేవి. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10వ తేదీ వచ్చిన కూడా ఇంత వరకు జీతాలు అందకపోవడంతో అప్కాస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. జీతాలు ఎప్పుడు పడతాయో అని ఆశగా సిబ్బంది ఎదురుచూడాల్సిన పరిస్థితి. దీనికి కారణం సీఎఫ్ఎంఎస్‌లో ఫండ్స్ నాట్ క్లియరెన్స్ అని చెబుతుండటంతో జీతాలు ఇంకా పడలేదని స్పష్టంగా అర్థమవుతోంది. జీతాలకు సంబంధించి టోకెన్ అమౌంట్ రైజ్ అయితేగాని ఉద్యోగులకు జీతాలు పడవు. ప్రభుత్వం ఖజానాలో డబ్బులు ఉండి టోకేన్ అమౌంట్ రైజ్ అయితే గాని అప్కాస్ ఉద్యోగులకు జీతాలు పడతాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు.

మూడు వేల మంది ఉద్యోగులు

గుంటూరు నగరపాలక సంస్థలో అప్కాస్ పద్ధతిలో ఇంజినీరింగ్ సెక్షన్ కింద 1064 మంది, శానిటేషన్ సెక్షన్ కింద రెండు వేల మంది దాకా పనిచేస్తున్నారు. వీరికి ప్రతి నెల జీతాలు ఒకటో తేదీన పడాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒకటో తేదీన జీతాలు పడిన పాపన పోలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 7వ తేదీన పడతాయని కొంత మంది అధికారులు చెప్పుకొచ్చారు. 7వ తేదీన కూడా పడకపోవడంతో జీతాలు ఎప్పుడు పడతాయో అని బ్యాంకు ఖాతాలను పరిశీలించుకుంటున్నారు.

ఈఎంఐలు కట్టలేక నానా తంటాలు

ఉద్యోగులకు చాలా మంది ఈఎంఐలు, బ్యాంకు లోన్లు ఉన్నాయి. కంపెనీలు ఈఎంఐలు ఒకటి నుంచి 5వ తేదీ వరకు ఈఎంఐకు సంబంధించి లోన్ రికవరీ చేస్తుంటాయి. 5వ తేదీ దాటిన జీతాలు పడకపోవడంతో కొంత మంది అప్కాస్ ఉద్యోగులకు ఫెనాల్టి పడుతున్నాయి. మరి కొంత మంది బయట అధిక వడ్డీలకు అప్పు తీసుకుని ఈఎంఐ, బ్యాంకు లోన్లు చెల్లిస్తున్నారు. 10వ తేది వచ్చిన కూడా జీతాలు పడకపోతే మాలాంటి చిరు ఉద్యోగుల పరిస్థితి ఏంటని కార్యాలయంలో బహిరంగంగా ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

కొలిక్కి వస్తున్న విచారణ

- డీఈ విచారణలో సామగ్రి అమ్ముకున్నట్లు అంగీకారం
- ఇంకా మరికొంత మంది పాత్రపై అనుమానాలు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు రిజర్వాయర్లలో పాత పైపులు, మోటార్లు, ఇతర ఇనుప స్క్రాప్‌ను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అమ్ముకుంటున్నారనే ఆరోపణలపై గత నెల 5వ తేదిన 'పాత సామన్లు అమ్మేసుకుంటున్నారు' అని సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దీనిపై విచారణకు ఆదేశించారు. గత నెల రోజుల క్రితం నుంచి డీఈ స్థాయి అధికారి విచారణ చేపట్టారు. ఈ విచారణ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది.

ఒప్పుకున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది..

మిర్చి యార్డు, హౌసింగ్ బోర్డు వాటర్ ట్యాంకుల్లో ఎవరైతే డ్యూటీలో ఉన్నారో వారు కచ్చితమైన సమాధానం చెప్పకపోతే అక్కడ విధులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి డీఈ వద్ద సామాన్లు అమ్ముకున్న మాట వాస్తవమే.. కాని నేను అందులో లేను.. నాకు విషయం తెలిసింది కాబట్టి ఈ విషయం బయట ఎవరికి చెప్పవద్దు అంటూ రూ.5 వేలు ఇచ్చా రని డీఈ వద్ద ఒప్పుకున్నట్లు సమాచారం. ఇందులో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా తెలిసింది. ఇదే విషయం ఎక్కడైన చెబుతానని... నాపై ఎటువంటి చర్యలు తీసుకున్న బాధ్యుడిని నేనని చెప్పినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ చేపట్టారు. ఇంజినీరింగ్ అధికారులు గతంలో ఏటీ అగ్రహారంలో పనిచేసిన ఇంజినీరింగ్ అధికారులపై కూడా సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.



గత నెల 5వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనం

వర్క్ ఇన్‌స్పెక్టర్లపై...

అదే విధంగా డిసెంబర్ 5వ తేదీన వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం అనే కతనం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై కూడా కమిషనర్ లోతుగా విచారణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు సమాచా రం. వీలైనంత త్వరగా వీరిని అంతర్గత బదిలీలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. హెచ్‌ఎల్‌ఆర్, బీఆర్ స్టేడియం, ఎల్‌బీనగర్, ఎల్‌ఎల్‌ఆర్, సర్కి ల్ ఆఫీస్ పరిధిలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్ల అవతారమెత్తి వర్కర్లు చేయడంపై, రెడ్డిపాలెం వాటర్ ట్యాంకుల్లో నగరపాలక సంస్థ నుంచి జీతం లేకుండా పనులు చేస్తున్న ఐదుగురు ఉద్యోగుల పనితీరుపై కమిషనర్ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారు లు విచారణ చేపట్టారు. దీంతో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అవు ట్ సోర్సింగ్ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

పట్నంబజారు: సైబర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్‌లో మంగళవారం ఈస్ట్ సబ్‌డివిజన్ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో ట్రైనీ ఐపీఎస్ దీక్షిత, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య, సిబ్బందితో కలసి ప్రభుత్వ మహిళ కళాశాల, ఏసీ కళాశాల విద్యార్థులతో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ మహిళ కళాశాల నుంచి 300 మంది విద్యార్థులతో నాజ్ సెంటర్, భగత్‌సింగ్ బొమ్మ, డీమార్ట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనీ ఐపీఎస్ దీక్షిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్ వినియోగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో అవగాహన ఉంటేనే సైబర్ నేరాలు అరికట్టగలుగుతామని చెప్పారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సైబర్ నేరాలు, ఇతర అసాంఘీక కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌కు సంబంధించి షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్‌లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్, తరంగిణి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ట్రైనీ ఐపీఎస్ దీక్షిత, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ వీరయ్య

పాతగుంటూరు పీఎస్ పరిధిలో

పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య ఆధ్వర్యంలో సైబర్ నేరాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించి అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో సెయింట్ లారెల్స్ పాఠశాల విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. కాకాని రోడ్డు ప్రధాన రహదారిలో మానవహారంగా ఏర్పడి సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాతగుంటూరు సీఐ సోమయ్య మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు, తోటి వారికి పోలీసులు తెలిపిన అంశాలు వివరించాలన్నారు. విద్యార్థులు వారి నివాస ప్రాంతాల్లో పెద్దలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు.

తాగునీటి పైపులైన్ తరలింపునకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మూడు వంతెనల దగ్గర రైల్వే శాఖ చేపడుతున్న నూతన వంతెన పనుల్లో భాగంగా నగరపాలక సంస్థ తాగునీటి పైప్‌లైన్ షిఫ్ట్ చేయడానికి సదరు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మూడు వంతెనల దగ్గర రైల్వే వంతెన పనులు, పైపులైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మూడు వంతెనల ప్రాంతంలో నూతన వంతెన పనులు రైల్వే శాఖ అధికారులు చేపట్టారని, అందులో భాగంగా నిర్మాణ పనులకు జీఎంసీ తాగునీటి సరఫరా పైప్‌లైన్ అడ్డంకిగా ఉందని తెలిపారన్నారు. నగరపాలక సంస్థ, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు సంయుక్త పర్యటన చేసి, పైప్ లైన్ షిఫ్ట్‌కి అవసరమైన ఖర్చులను రైల్వే శాఖ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఈఈకి సూచించారు. ఈ పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ కళ్యాణరావు, ఏఈ నాగవేణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వీస్ చార్జీలు చెల్లించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు నగరపాలక సంస్థ చెల్లించాల్సిన సర్వీస్ చార్జీలను సత్వరమే చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సర్వీస్ చార్జీల వసూలుపై ఆయా డిపార్ట్‌మెంట్‌లతో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రూ.32 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, రెహ్మాన్, సాదిక్ బాషా పాల్గొన్నారు.



మూడు వంతెనల వద్ద పనులు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

బాల్యవివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలు యాక్టివ్‌గా ఉండాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలు యాక్టివ్‌గా ఉండాలని, జీఎంసీ పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగడానికి వీలు లేదని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సీహెచ్ విజయ్ కుమార్ అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వార్డుల వారీగా నియమించిన బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలకు బాల్య వివాహ నిషేధ చట్టం -2006, రూల్స్ 2023 పై అవగాహన నిర్వహించారు. వార్డుల వారీగా కార్పొరేటర్ ఛైర్‌పర్సన్‌గా, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి కన్వీనర్‌గా, అడ్మిన్, వీఆర్‌ఓ, స్థానిక స్కూల్ హెచ్‌ఎం, స్వయం సహాయక సభ్యులు, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్, ఎన్జీఓ ప్రతినిధులు సభ్యులుగా బాల్య వివాహాల నిషేధ, పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఆయా కమిటీలు ప్రతి నెలా సమావేశమై, కౌమార బాలల జాబితాలు, దీర్ఘకాలంగా స్కూల్‌కి గైర్హాజరైన వారి వివరాలతో జాబితాలు తయారు చేయాలన్నారు. అన్ని సచివాలయాలు, సంస్థల్లో చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ 181, ఈఆర్ఎస్ఎస్ 112 నంబర్లను డిస్‌ప్లే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

రేపు పాలస్తీనా సంఘీభావ సభ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్ఓ), నవయువసమాఖ్య(ఎన్‌వైఎస్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం పాలస్తీనా సంఘీభావ సభ నిర్వహించనున్నట్లు ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాషా తెలిపారు. జిల్లా కోర్టు వద్ద ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సభ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. బాషా మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండలో ఇప్పటి వరకు 45 వేల మంది పాలస్తీనియన్లు మరణించారని పేర్కొన్నారు. పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావంగా పీడీఎస్ఓ- ఎన్‌వైఎస్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో తలపెట్టిన సభలో విద్యార్థులు, యువకులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు కలిగి ఉన్న పశ్చిమాసియా దేశాలపై పట్టు సాధించేందుకు ప్రపంచ పటంలోనే లేని ఇజ్రాయిల్‌ను అమెరికా సృష్టించిందని, పాలస్తీనా జాతి అననమే లక్ష్యంగా ఆ జాతి ప్రజలపై అత్యంత దుర్మార్గంగా దాడులు చేస్తూ నిత్యం మండే రావణ కాష్టంలా పాలస్తీనాను మార్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను, ఎన్‌వైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీను, వి.విశ్వ తేజ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న బాషా, భాస్కర్, భాను

20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ద అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లు సంయుక్తంగా ఈనెల 20వ తేదీన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నట్లు కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ తెలి పారు. ఎఫ్‌డీపీ పోస్టర్‌ను మంగళవారం వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్' అనే అంశంపై ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా ముంబై ఏసీసీఏ నుంచి జాకీర్ ఎ.సయిద్, చెన్నై నుంచి కె. రాయిస్టన్ ఎబినేజర్ హాజరవుతారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జియాలజీ విభాగాధిపతి పీజే రత్నాకర్ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు

స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందన



తాడేపల్లిరూరల్ : స్విమ్మింగ్ అంతర్ రాష్ట్ర పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ గెలిచిన క్రీడాకారులకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అలీమ్ బాషా మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీలలో 9వ ఏపీ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్స్ జూనియర్, సబ్ జూనియర్ ఈతల పోటీలో విశాఖపట్టణంలో జరిగాయని, ఈ పోటీలలో మంగళగిరి పట్టణంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొహమ్మద్ సంషేర్‌ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ వీరందరూ శిక్షణ పొందారని, జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌లో మన కార్పొరేషన్ నుండి ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన ఎస్కే నజ్రీన్, ఎస్కే నస్రీన్, ఎం. లక్ష్మి పావనిలను అభినందించారు. జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన శిక్షకులు పడమట నాంచారమ్మను, నాగేశ్వరరావును కమిషనర్ అభినందించారు.

27 నుంచి 29వ తేదీ వరకు నాటిక పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య, విద్యా, సాహిత్య కళారంగాల్లో డాక్టర్ కాసరనేని సదాశివరావు అందించిన సేవలు నిరుపమానమని, ఆదర్శవంతమైన ఆయన జీవితం నేటి తరానికి దిక్సూచి అని డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు మోపర్తి నాగేశ్వరరావు అన్నారు. లలితకళానికేతన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న కళా పరిషత్ 14వ వార్షిక నాటిక పోటీల బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పరిషత్ అధ్యక్షుడు అప్పసాని నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో మానసిక వికాసానికి, వర్తమాన సామాజిక సమస్యలపై అవగాహనకు తోడ్పడతాయని చెప్పారు. పరిషత్ కార్యదర్శి నందిపాటి ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి విద్యతో పాటు కళారంగ పరిచయం కూడా అవసరమనే ఉద్దేశంతో ఈ సంవత్సరం నుంచి స్కూలు పిల్లలకూ నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు మాట్లాడుతూ నాటికలను ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 3 రోజులపాటు నిర్వహిస్తున్నామని, మొత్తం 8 నాటికలు పోటీలో ఉంటాయని పిల్లల నాటికలు ప్రత్యేక ప్రదర్శనలుగా ఏర్పాటు చేశామని అన్నారు. సభలో పెద్ది రమేష్, చిగురుపాటి రమేష్, మోపర్తి పరమేశ్వరరావు, అత్తోట సుబ్బారావు, మానుకొండ వెంకటేశ్వరరావు, మీరావలి, నందిపాటి రమణ, పిన్నమనేని చౌడేశ్వరరావు డాక్టర్ కాసరనేని కుటుంబ ప్రతినిధిగా జయశంకర్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, ప్రసాద్, కాళిదాసు, సుబ్బారావు

కుమారుడిపై తండ్రి దాడి

లక్ష్మీపురం: కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. స్తంభాలగరువు ప్రాంతానికి చెందిన కొండదాటి శ్యాంసన్‌కు భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సాకేత్, సిద్దు ఇద్దరు బీటెక్ పూర్తి చేశారు. సాకేత్ మెడికల్ షాపులో పని చేస్తు కుటుంబంలో తల్లి దండ్రులకు సహాయంగా ఉన్నాడు. గత కొద్ది కాలంగా పెద్దకుమారుడు సాకేత్ అనారోగ్యంగా ఉండటంతో మెడికల్ షాపునకు వెళ్లడం లేదు. సాకేత్ తండ్రి శ్యాంసన్ నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను అసభ్యంగా తిట్టడం చేస్తుంటాడు. సాకేత్‌లతో పాటు శ్యాంసన్ తమ్ముడు, పిల్లలు కూడా ఒకే ఇంట్లో ఉంటారు. అయితే సోమవారం అర్ధరాత్రి 11.30 గంటలకు సమయంలో తల్లి సునీత బయటకు వెళ్లిన సమయంలో తండ్రి శ్యాంసన్ మద్యం తాగేందుకు కొంత డబ్బు కావాలని గొడవకు దిగాడు. మద్యానికి డబ్బు ఇవ్వని పక్షంలో ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని కేకలు వేస్తున్నాడు. దీంతో పెద్దకుమారుడు సాకేత్ తండ్రిని మద్యం మత్తులో ఉన్నావని గొడవ చేయవద్దని మందలించే యత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా కోపంతో శ్యాంసన్ వంటగదిలో ఉన్న కూరగాయాలు కోసే కత్తిని తీసుకు వచ్చి కుమారుడు సాకేత్‌ను పొడిచి గాయపరిచాడు. దీన్ని గమనించిన సాకేత్ సోదరుడు సిద్ధూ తక్షణమే ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తీసుకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్స అనంతరం మంగళవారం రాత్రి తండ్రి శ్యాంసన్‌పై కుమారుడు సాకేత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పొన్నూరు: నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన పకడ్బందీగా నిర్వహించాలని ఇరిగేషన్ చీరాల డీఈ, మాస్టర్ ట్రైనర్ ఎన్‌కేవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియపై పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరరావు, జానీబాషా, రత్నకిషోర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.భావన్నారాయణ డిమాండ్ చేశారు. స్వర్ణాంధ్ర నగర్ కాలనీలో విద్యుత్ చార్జీల పెరుగుదలను వివరిస్తూ కరపత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా అదానీపై ఇలాంటి ఆరోపణలే వచ్చినా కేంద్ర ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఎలాంటి విచారణ జరగలేదని విమర్శించారు. ప్రస్తుతం అమెరికన్ ప్రభుత్వమే కేసు నమోదు చేయడంతో మన దేశ ప్రతిష్ఠ మసకబారిందన్నారు. అదానీ విదేశీ బొగ్గును 10శాతం కొనాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు షరతు పెట్టిందని, ఎక్కువ ధరకు కొన్న కారణంగా విద్యుత్ ఛార్జీలు పెరిగి ఆ భారం ప్రజలపై పడిందని పేర్కొన్నారు. ప్రస్తుత వివాదాలకు కారణమైన సోలార్ విద్యుత్ ఒప్పందం కూడా అలాంటిదేనని అన్నారు. ఒకవైపు నిత్యావసరాల ధరలు రోజు రోజుకు పెరుగుతుంటే కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం వేయటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బగాతి సత్యనారాయణ, పాలు, జానీ పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ చాంపియన్‌గా 'ఎస్‌ఏవీఆర్'



గుంటూరు వెస్ట్(క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీల విజేతగా ఎడ్లపల్లికి చెందిన ఎస్‌ఏవీఆర్ జెడ్పీ హైస్కూల్ జట్టు నిలిచిందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రతిభకన బరచిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. పోటీలకు ఆర్థిక చేయూతనందించిన కేఆర్ ఫోకస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎస్.కోటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు.